# చావు

"ఏయ్!"

"...........''

"ఏయ్! నిన్నే!"

"అబ్బ నాకు నిద్రవస్తూ వుంది.మళ్ళీ రావోయ్ మిత్రమా!"

"నే నె వ రి నో తెలుసుకోకుండా మాట్లాడుతున్నావ్!"

"నువ్వు ఎవరివో తెలుసుకోకుండా మాట్లాడుతున్నావ్. అది నీ తప్పు."

"హహ్హహ్హా."

"ఏమిటా వెధవ నవ్వు."

"చిత్రంగా వుందే! నా నవ్వు వింటే భయం వేయటం లేదూ?"

"చిత్రంగా వుందే! నీ వెధవ నవ్వు వింటే నాకేం భయం."

"నేనెవర్నో తెలుసుకోకుండా మాట్లాడుతున్నావ్! నేనెవర్నో తెలుసుకొంటే...."

"నువ్వు ఎవరివో, నీ వెకిలినవ్వుతోనే అర్థమవుతూ వుంది. పిలవకుండా వచ్చిన నీ సభ్యతే తెలుపుతోంది—నువ్వు ఏపాటి దానివో."

"నువ్వు బొట్టు పెట్టి పిలవక్కర్లేదు నన్ను. నీవు నన్ను గురించి ఆలోచిస్తే చాలు. నీ దగ్గరికి "రయ్" మంటూ వచ్చేస్తాను."

"నీ వుద్దేశ్యమేమిటో అర్థం కావటం లేదు. నువ్వెలా పిచ్చిగా ఎందుకు ప్రవర్తిస్తున్నావో అర్థం కావటంలేదు!"

"నేను పిచ్చిదాన్ని కాదు. నేను పిచ్చిదాన్నయితే, నన్ను గురించి ఈ ప్రజ అంతా ఇలా భయపడరు."

"అచ్చా."

"ఆ! నన్ను తెలుసుకొని. తెలుసుకొని వచ్చిన—నీ మిత్రుడు పరంధామయ్యను చంపిన చావుని నేను."

"నువ్వా!!"

"నేనే. రేపు నీ పక్కింటి సుందరయ్యని, ఎల్లుండి మరో అప్పలమ్మని—ఇలా అందర్నీ నాలో కలుపుకొనే—చావుని నేను."

"నువ్వు! నువ్వు నా దగ్గరికెందుకొచ్చావ్!?"

"ఈవేళ నా దగ్గరికొచ్చిన పరంధామయ్యని చంపిన—నాగురించి తీవ్రంగా ఆలోచించావుగనుక."

"అవును నీగురించి ఆలోచించాను! పరంధామయ్య నీ దగ్గరికి ఎందుకొచ్చాడో అర్థంకాక ఆలోచించాను! అతనిలోని ఏ వికారాళ నిన్నుగురించి ఆలోచించి, నీ దగ్గరికి లాక్కొచ్చిందో తెలుసుకోవడానికి ఆలోచించాను!"

"అంతేగాని నేనంటే నీకు భయం లేదా?"

"లేదు."

"హ్హాహ్హాహ్హా....హ్హాహ్హాహ్హా....హ్హాహ్హాహ్హా"

"నువ్వంటేనే భయంలేని నాకు, నీ నవ్వంటే భయం ఎందుకుంటుంది? అందుకే నిన్ను 'పిచ్చిదానివి' అన్నాను."

"హ్హాహ్హాహ్హా....హ్హాహ్హాహ్హా—"

"నవ్వకు, నువ్వు నవ్వి నవ్వి నీ నాలుక తెగిపోయినా నేను భయపడను."

"హ్హాహ్హాహ్హా...."

"ఇంతలా, నోరు తెరిచి నవ్వుతున్న నిన్ను భయపెట్టడానికి—నా చిరునవ్వే చాలు!"

"నిజమే!...నువ్వంటున్నది నిజమే!.. ఏమిటిది....నీ చిరునవ్వువల్ల నాకు వణుకు వస్తూవుంది ...ఒళ్ళంతా చెమటలు పట్టిపోతున్నాయ్...."

"తెలిసిందా! నేను ఎంతటివాడ్నో! వెళ్ళిపో నువ్వు—లేకపోతే నేను నవ్వుతాను! నా నవ్వువల్ల నువ్వు దగ్ధమయిపోతావ్!"

"వెడతాను! వెళ్ళేముందు ఒక చిన్న ప్రశ్న—నువ్వు ఎవరివి?"

"నేను నీగురించి తలుచుకొనే నిరాశను తొలిగించి, వయసు మూడకుండే, ఆశలు తీరండే, నిన్నుగురించి ఆలోచించి—నీ దగ్గరకు రాకుండా—నన్నూ, నా చుట్టూ వున్న వాళ్ళనీ అభ్యుదయంలోకి నడిపించే అభ్యుదయవాదిని. నిరాశల్ని ఓడించి, ఆశలను గెలుచుకొనే—ఆశావాదిని."

"..........."

త్రిపురనేని రామ్‌గోపాల్

## బ్రాందెఫెక్ట్

* ఒక సెకండరీ గ్రేడ్ టీచరు గారు బ్రాందీవలన కలిగే అనర్థాలను గురించి వివరిస్తున్నారు క్లాసులో. మానవుని శరీరంలో జీవించే కొన్ని పురుగులను తెచ్చి నీళ్ళున్న గ్లాసులో వేశారు. అవి బ్రతికేవున్నాయి. వెంటనే బ్రాందీ వున్న మరో గ్లాసులో వేశారు. వెంటనే ప్రాణం వదిలాయి.

"దీనివలన మనం నేర్చుకొన్న నీతి ఏమిటి?" క్లాసు వైపు చూచి ప్రశ్నించారాయన.

"త్రాగగలినంత బ్రాందీ రోజూ త్రాగగలిగితే మంచిది." విద్యార్థుల్లోంచి జవాబు వెంటనే వచ్చింది.